# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశీయంగా ప్రైవేట్ రంగంలో రూపొందిన మొట్టమొదటి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతంగా కక్ష్యలోకి చేరడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు.
- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ఈరోజు ఢిల్లీలో ప్రకటించింది, 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా ఎంపికైంది.
- ఉగ్రవాదంపై భారత్ అవలంబిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానం కేవలం మాటలకే పరిమితం కాదని, అది దేశ దృఢ సంకల్పమని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, కేరళం రాష్ట్రాల్లో రేపటి వరకు కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాలు పడే అవకాశం వుందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = =

భారత స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్టమొదటి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయాన్ని అందుకుంది. 'మిషన్ ఆగమన్'లో భాగంగా ఈరోజు ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. నిర్దేశిత ఉపగ్రహాలను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో ప్రైవేటు రంగంలో ఆర్బిటల్ లాంచ్ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలో మూడో దేశంగా భారత్ అవతరించింది. ఈ విజయాన్ని సాధించిన 'స్కైరూట్ ఏరోస్పేస్' సంస్థకు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సామాజిక మాధ్యమం వేదికగా అభినందనలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయంగా ప్రైవేట్ రంగంలో రూపొందిన మొట్టమొదటి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతంగా కక్ష్యలోకి చేరడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'స్కైరూట్ ఏరోస్పేస్' బృందానికి ప్రధానమంత్రి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. ఈ విజయం దేశంలోని యువతకు స్ఫూర్తినిస్తుందని, ఆవిష్కరణల వైపు వారు అడుగులు వేసేలా ప్రోత్సహిస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్…24 సెకన్లు)

ఈ సందర్భంగా 'టీమ్ విక్రమ్-1' సభ్యులను స్వయంగా కలవాల్సిందిగా ప్రధానమంత్రి ఆహ్వానించారు.

= = = = = = = = = = = = = = = = = =

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ఈరోజు ఢిల్లీలో ప్రకటించింది. ఫీచర్ ఫిల్మ్స్ జ్యూరీ ఛైర్మన్ జయరాజ్, నాన్-ఫీచర్ ఫిల్మ్స్ జ్యూరీ ఛైర్మన్ అసిమ్ కుమార్ సిన్హా సంయుక్తంగా ఈ అవార్డుల వివరాలను వెల్లడించారు. బాలీవుడ్ చిత్రం 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డును కైవసం చేసుకుంది. 'భ్రమయుగం' చిత్రంలో నటనకు మమ్ముట్టి, అలాగే 'చందు ఛాంపియన్' నటనకు గానూ కార్తీక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును గెలుచుకున్నారు. 'ఆర్టికల్ 370' చిత్రంలో నటనకు గాను యామీ గౌతమ్

ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. అమరన్ చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియాసామి ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' జాతీయ పురస్కారానికి ఎంపికైంది.

= = = = = = = = = = = = = = = = = = =

'ఆధార్ మొబైల్ యాప్' డౌన్‌లోడ్‌ల సంఖ్య 4 కోట్ల మార్కును దాటినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఈరోజు వెల్లడించింది. సులువైన, సురక్షితమైన డిజిటల్ గుర్తింపు సేవలపై దేశ ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి ఈ సంఖ్య నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు దాదాపు 49 లక్షల మంది పౌరులు మొబైల్ నంబర్లను ఈ యాప్ సహాయంతో అప్‌డేట్ చేసుకున్నారని, భద్రతా పరంగా అత్యంత కీలకమైన 'బయోమెట్రిక్ లాక్ లేదా అన్‌లాక్' సదుపాయాన్ని 1.9 కోట్ల సార్లు వినియోగదారులు ఉపయోగించుకున్నారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం మంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి పరిధిలో గల జుమాగచ్ సరిహద్దు భద్రతా దళం (BSF) క్యాంప్‌ను ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బిఎస్‌ఎఫ్ జవాన్ల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంప్ ప్రాంగణంలో మొక్కలు నాటిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన 'ప్రహరీ సమ్మేళనం'లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా దేశ సరిహద్దు ప్రాంతాలను మరింత బలోపేతం చేయడం, శాంతిభద్రతల సమీక్షతో పాటు జనన, మరణాల నమోదు ప్రక్రియ వంటి కీలక అంశాలపై ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదంపై భారత్ అవలంబిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానం కేవలం మాటలకే పరిమితం కాదని, అది దేశ దృఢ సంకల్పమని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన 'ఫోర్సెస్ ఫస్ట్ కాన్‌క్లేవ్'లో ఆయన మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్'లో దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక క్షిపణి వ్యవస్థలైన ఆకాశ్‌తీర్, ఆకాశ్ క్షిపణులు, బ్రహ్మోస్ సహా ఇతర రక్షణ సంపత్తిని వినియోగించినట్లు ఆయన వెల్లడించారు. గడచిన పన్నెండేళ్లలో రక్షణ రంగాన్ని పునరుద్ధరించడం, బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాజ్‌నాథ్ తెలిపారు. రక్షణ సంసిద్ధతను పెంచడంతో పాటు, సైనిక దిగుమతులను గణనీయంగా తగ్గించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. దేశీయ రక్షణ ఉత్పత్తి రంగానికి మరింత ఊతమిచ్చేలా ఈ ఏడాది సరికొత్త 'రక్షణ కొనుగోలు విధానాన్ని' ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి వెల్లడిస్తూ…

(వాయిస్…26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. నగర శివారులోని రామోల్ ప్రాంతంలో జరిగిన ఈ దుర్ఘటనలో 5 గురు  కార్మికులు సజీవ దహనమవగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (RAF) సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేసిన ఆయన.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు 2 లక్షల రూపాయల చొప్పున, అలాగే తీవ్రంగా గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖకు చెందిన తపాలా శాఖ అధికారిక చిహ్నం రూపకల్పన కోసం జాతీయ స్థాయి పోటీని ప్రారంభించింది. 'ఇన్నోవేట్ ఇండియా మైగవ్' (MyGov) ప్లాట్‌ఫామ్ వేదికగా ఈ పోటీని నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ వెల్లడించింది. విశ్వాసం, నమ్మకం, నిరంతర సేవ, డిజిటల్ ఆవిష్కరణల వంటి సంస్థ మూల విలువలు ప్రతిబింబించేలా ఒక విశిష్ట బ్రాండ్ అంబాసిడర్‌ను సృష్టించడమే ఈ పోటీ ప్రధాన లక్ష్యం. ఆసక్తి గల అభ్యర్థులు తాము రూపొందించిన ఒక ఒరిజినల్ మాస్కట్ డిజైన్, పేరు, అలాగే ఆ డిజైన్ వెనుక ఉన్న ఆలోచనను వివరిస్తూ మైగవ్ (MyGov) పోర్టల్ లో సమర్పించాలి.

= = = = = = = = = = = = = = = = = = =

భారత స్టార్ షట్లర్, ఒలింపిక్ పతక విజేత పి.వి.సింధు టోక్యోలో జరుగుతున్న జపాన్ ఓపెన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ ఫైనల్లోకి చేరింది. చైనాకు చెందిన చెన్ యూఫీ తో ఈరోజు జరిగిన సెమీఫైనల్ పోరులో తొలి సెట్‌ను సింధు 21-19తో కైవసం చేసుకుంది. ఆ తర్వాత రెండో సెట్‌లోనూ సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ 15-10తో ఆధిక్యంలో ఉన్న సమయంలో.. చెన్ యూఫీ గాయం కారణంగా మ్యాచ్ నుంచి అర్థాంతరంగా తప్పుకుంది. దీంతో సింధు నేరుగా ఫైనల్‌కు చేరుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =

ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో రేపటి వరకు కొన్ని ప్రాంతాల్లో అత్యంత తీవ్రమైన వర్షాలు పడే అవకాశం వుందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. జమ్మూ కశ్మీర్, లదాఖ్, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా ప్రాంతాల్లో రేపటి వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది. అలాగే.. కేరళం రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు IMD అధికారులు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

లద్దాఖ్ ఉద్యమ నేత, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ ను అవసరమైన వైద్య సేవల నిమిత్తం ఈరోజు ఢిల్లీలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =